# తప్పుల తమాషా

వార్తా పత్రికలలో మీరు చదివే ఉంటారు, ఇటీవల ఫలానా ప్రొఫెసర్ డాక్టర్ కె. ధర్మారావు గారికి జరిగిన సన్మానం గురించి. ధర్మారావు గారు ఫలానా ఫలానా యూనివర్సిటీలో అధ్యాపక వృత్తి చేపట్టి ఇరవై ఐదు సంవత్సరాలు గడిచాయి. అంతేకాదు, అదే సమయంలో ఆయనకు బెస్ట్ టీచర్ అవార్డు కూడా అందింది. సదరు అవార్డు ఇచ్చిన "మారీచా మేజిక్ సర్కిల్" లో నేనూ సభ్యుడినే.

అందుకే, అందులోని లోతుపాతులు తెలిసిన వాడిని కనుకనే, ఆ అవార్డు ఆయనకు వచ్చినందుకు పూర్వ విద్యార్థులు తలపెట్టిన సన్మానంలో పాల్గొనరాదని నిశ్చయించుకున్నాను. కాని-

ఆ సన్మానం రేపే అనగా, ఆ ముందు రోజున కాలేజీలో నేను సీనియర్ ఇంటర్ క్లాస్‌కి ప్రిపేర్ అవుతున్నట్లు నన్ను నేను మభ్యపెట్టుకుంటుండగా, మా మేజిక్ సర్కిల్ సభ్యుడు మోహన్ వచ్చాడు. వస్తూనే తన మేజిక్స్ సహాయంతో నాకళ్లముందు ఉన్న ఫిజిక్స్ టెక్స్ట్ బుక్‌ని మాయం చేశాడు.

"నా పుస్తకం నాకిచ్చెయ్యి మోహన్. గంటలో సీనియర్ ఇంటర్ క్లాస్ చెప్పాలి" అన్నాను.

(అన్నట్లు నేను ఎమ్మెస్సీ ఫిజిక్స్ డిగ్రీ తీసుకున్నాక ఎన్. ఎం. ఆర్ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా చేరానని మీకు చెప్పనేలేదు కదూ!)

నేను క్లాస్ తీసుకోవాలని తహతహ లాడటం చూసి అదో పెద్ద జోక్ అన్నట్లుగా డబడబా నవ్వేశాడు మోహన్. "ఒరే, ఒరే! తల్లి పుట్టిల్లు మేనమామకి తెలీదా అన్నట్లు, నీ శ్రద్ధ గురించి నా దగ్గర కోసి నన్ను మోసం చేయలేవురా!" అన్నాడు.

మోహన్ నా బాల్య స్నేహితుడు. ఎమ్. ఎస్. సి. లో నా క్లాస్‌మేట్. యూనివర్సిటీలో గడిపిన రెండేళ్ళలోనే వాడు మేజిక్ నేర్చుకుని ఇండియన్ మేజిక్ సర్కిల్‌లో సభ్యుడు కాగ లిగాడు. ఆ కృషిలో చదువు వెనక పడింది. ఫేలయ్యాడు. కాని ఎమ్మెస్సీకి బదులు ఎమ్. ఐ. ఎమ్. సి అనే మేజిక్ సర్కిల్ సభ్యత్వం వచ్చింది కనుక నలుగురినీ బోల్తా కొట్టించి, మేజిక్కులు చేసి ఓ పెద్ద మందుల కంపెనీలో సేల్స్ ఆఫీసర్ కాగలిగాడు. ఏనాడూ ఎమ్మెస్సీ క్లాసులకు హాజరు కాక పోయినా వాడికి అధ్యాపకులంటే ఎంతో గౌరవం. (ఆ మాటకొస్తే ఆ అధ్యాపకులు ప్రిపేర్ అవకుండా క్లాసులకి వచ్చినప్పుడు కొట్టే 'సుత్తి' వాడికి తప్పింది కనుకనే అధ్యాప

కులంటే గౌరవం అని ఒక సిద్ధాంతం ఉంది.)

అందుకే వాడు-

"ఓ ప్రక్క మన ప్రొఫెసర్ గారికి ఘన సన్మానం జరుగుతూ ఉంటే ఇంటర్ కుర్ర గుంటల క్లాసు గురించి అంత వర్రీ ఏమిటోయ్!" అన్నాడు.

నేను "మోహన్, ప్లీజ్! ఆ పుస్తకం ఎక్కడ మాయం చేశావో కాని, వెంటనే ఇచ్చేయరా! గంటలో క్లాస్ తీసుకోవాలి" అంటూ మోహన్ ని రిక్వెస్ట్ చేస్తుంటే మా ప్రిన్సిపాల్ ఎన్నెమ్మార్ (శ్రీ నిద్ర మందేశ్వరరావు గారు) స్వయంగా మా స్టాఫ్‌రూం లోకి వచ్చేసారు.

వస్తూనే "అందరం సాయంత్రం ట్రెయిన్ కే వెళ్దామోయ్! తెలుసుగా, నేనూ కేడీ రావూ (డాక్టర్ కె. ధర్మారావు) యూనివర్సిటీలో కలిసి చదువుకున్నాం. నేనిలా టీచింగ్ కి వచ్చేశాను. వాడు మాత్రం యూనివర్సిటీ సర్వీస్ లో చేరాడు." అని ప్రిన్సిపాల్ గారు అంటుంటే మోహన్ మళ్ళీ గలగలా నవ్వేశాడు.

ఆ నవ్వెందుకో అర్థం కాక ఆయన చూస్తుంటే మోహన్, "క్షమించాలి మేష్టారూ నాపేరు కే. ఆర్. కే. మోహన్, ఎమ్. ఐ. ఎమ్. సి, మీరు అనుకోకుండా గొప్ప నిజం చెప్పేశారనే ఆనందంతో నవ్వాను.

"ఏమిటా నిజం?" ఎన్నెమ్మార్ చిరునవ్వుతో అడిగారు.

"అదేనండి. మీరు ఎమ్మెస్సీ అయ్యాక టీచింగ్ కి వచ్చేసినట్టూ, ప్రొఫెసర్ కేడీరావు గారు యూనివర్సిటీలో చేరినట్టూ అన్నారు కదా. అంటే యూనివర్సిటీ మేష్టార్లు టీచింగ్- అంటే పాఠాలు-చెప్పరు అనే పరమసత్యం ధ్వనించింది! ఈ రోజుల్లో నిజం ఎంత కరువై పోయిందంటే, కొంచెం నిజం వినిపిస్తే చాలు- ఆ షాక్ కి కొందరు సామాజిక స్పృహ తప్పి పడిపోతున్నారు....ఎనీవె అయామ్ సో హేపీ సర్! మీరు కేడీరావు గారి క్లాస్‌మేట్ అని! నేను ఆయన శిష్యుణ్నండి. నేనూ వీడూ ఎమ్మెస్సీ ఆయన దగ్గరే చదువుకున్నాం. ఫస్టియర్ ఓ సబ్జెక్టూ, సెకండియర్ ఓ సబ్జెక్టూ తీసుకున్నారాయన. గొప్ప టీచరండి. డెమస్తనీస్, సురేంద్ర నాథ్ బెనర్జీ, గిరీశం మొదలైన దిగ్గంతుల కోవకు చెందిన వారాయన," అన్నాడు భక్తి నటిస్తూ.

ఎన్నెమ్మార్ గారు మురిసిపోతూ, "యూ ఆర్ పెర్‌ఫెక్ట్‌లీ రైట్ మోహన్! ఇది మీ ఫ్రెండ్ కి చెప్పు. మిస్టర్ భద్రిరాజూ! యూ మస్ట్ అటెండ్ దిస్ ఫంక్షన్" అని ఓ ఆర్డర్ పడేశారు.

తప్పదుగా.

ఆ సాయంత్రం ట్రెయిన్ లో నేను, ఎన్నెమ్మార్, మోహన్, అతని చెల్లెలు వసంత; ప్రయాణం చేసి యూనివర్సిటీ సిటీ అప్పాపురం చేరుకున్నాం.

యూనివర్సిటీ గెస్ట్‌హౌస్ లో మేమిద్దరం బస చేయగా, మోహన్ వసంతలు వాళ్ల చుట్టాలింటికి వెళ్లిపోయారు. రేపు ప్రొ॥ కేడీ మెడలో వేసే నాలుగు దండలూ తెచ్చే భారం మోహన్ పైనే వేశాం.

* * *

కొత్తగా కట్టినది కనుకనేమో ఆ యూనివర్సిటీ భవనం గోడలు రకరకాల బీటలతో,

విద్యార్థుల రచనలతో జుగుప్సాకరంగా ఉన్నాయి. మెట్లమీది ప్లాస్టర్ల్ ముక్కలు ఊడిపోయి, 11వ శతాబ్దం నాటి ప్రాచీన కట్టడాలు గుర్తుకు వస్తున్నాయి. అందుకనే అతి ప్రాచీనమైన మన భారతీయ సంస్కృతిని గౌరవించే వారందరూ, 20వ శతాబ్దంలో కట్టిన ఈ భవనాన్ని కొద్ది వారాల్లోనే ప్రాచీన శిథిలంలా కనిపించే గొప్ప నైపుణ్యాన్ని కనపర్చిన ఇంజనీర్ల, కాంట్రాక్టర్ల మేజిక్ శక్తిని మెచ్చకుండా ఉండలేదు.

నేనూ ఎన్నెమ్మార్ గారూ మెట్లమీద గుంటల్లేని చోట్లు వెతుక్కుంటూ జాగ్రత్తగా అడుగులు వేస్తూ మెట్లెక్కుతుంటే మోహన్ వసంతలు రెండేసి దండలతో ఎదురు వచ్చారు.

మోహన్‌కి సడెన్‌గా నామీద భక్తీ గౌరవం పెరిగిపోయినట్లు గ్రహించాను. వాడు నన్ను చాటుకు పిలిచి, "ఇంతాలస్యం చేశావేం రాజూ. సభ అరగంట క్రితమే మొదలైపోయింది. నేనూ, చెల్లీ ఇప్పుడే వచ్చామనుకో" అని ఇంకేమో చెప్పబోతుంటే,

లౌడ్ స్పీకర్లలోంచి "ఇప్పుడు కేడీరావు గారి పూర్వ విద్యార్థులు - హహం విద్యార్థులు అంటే విద్యార్థినులూనూ ఒక్కొక్కరే వచ్చి ఆయనకు పూల మాలలు వేసి తమ గురు భక్తిని వెల్లడిస్తారు" అని వినపడింది.

వెంటనే ఎన్నెమ్మార్‌గారు నన్ను రెక్కపట్టుకుని ఆ హాల్లోకి లాక్కెళ్లారు. వెనకాల రుమాలుతో చెమట తుడుచుకుంటూ మోహన్, అతని వెనకాల పెద్ద పెద్ద దండల బరువుకో ఏమో తడబడుతూ వసంతా!

కాని లోపల అడుగుపెట్టగానే మాకో వింత దృశ్యం కనపడింది.

చేతుల్లో పూలదండలు పట్టుకున్న అనేకమంది యువకులు వేదిక దగ్గర్నుంచి దూరంగా అంటే మా వైపు వచ్చేస్తున్నారు. వాళ్లలో నలుగురు ఎమ్మెస్సీలో మా జూనియర్లు. వాళ్లు మోహన్ రెండు చెవులూ పట్టుకుని "మోహన్‌గారూ, ఇవి చెవులు కావు కాళ్లనుకోండి ...ఇప్పుడా వేదిక మీదున్న నలుగురు పెద్దల్లోనూ మన ప్రొఫెసర్ గారు ఎవరో చెప్పి పుణ్యం కట్టుకోరూ. మేమూ ఏవేవో కాలేజీల్లో లెక్చరర్స్ గానే పనిచేస్తున్నాం" అని బతిమాలుతుంటే మోహన్ ఆశ్చర్యం నటిస్తూ.

"ఏమిటీ? ప్రతీ బ్యాచ్‌కీ రెండేళ్ళూ కేడీగారు పాఠాలు చెప్పారే, రెండేళ్లూ ఎలా చదివారయ్యా, ఆయన మొహం తెలీకుండా? అంటే మీరు ఏనాడూ క్లాస్‌మొహం చూడలేదన్న మాట! అందుకే దేశం ఇలా ఏడుస్తోంది! ఇప్పుడు ఈ విపత్కర పరిస్థితిలో నేను నా విషాదాన్ని దిగమింగి మీకిచ్చే సలహా ఇదే...మీ సీనియర్ భద్రిరాజు. భద్రిరాజుని ఫాలో అవ్వండి. వాడు ముందుగా దండేస్తాడు. వాడెవరికి దండేస్తే ఆయనే ప్రొఫెసర్ కేడీ అని అర్థం కదా. మీరూ ఆయనకే వేసేయండి. లెర్న్ ఫ్రం యువర్ సీనియర్స్!" అని కాలర్ సవరించుకున్నాడు గర్వంగా.

ఆ జూనియర్ లెక్చరర్లు నలుగురూ ఇంత మొహం చేసుకుని నా చుట్టూ చేరి, "భద్రిరాజు గారూ! మీరే మాకు మార్గ దర్శకులు. మీరు ముందు దండ వేసేస్తే మేమూ వేసేస్తాం... ఈ దండలకి అప్పుడే చీమలు పట్టేసి, మమ్మల్ని కుట్టేస్తున్నాయి. పొద్దున్నించీ మోస్తున్నాం" అన్నారు బాధగా.

నేను రొమ్ము విరుచుకుని, వసంత వేపు ఓ చిరునవ్వు విసిరి, "మీర్నలుగురూ నా

వెనకాల క్యూలో నిల్చోండి." అన్నాను. రైలాట ఆడే చిన్న పిల్లలు ముందు వాడి చొక్కా వెనకవాడూ, వాడి చొక్కా వాడి వెనకవాడూ పట్టుకుని క్రమశిక్షణ నటిస్తూ నడిచినట్లు మేం ఐదుగురం వేదిక వైపు సాగాం.

ప్రొఫెసర్ గారికి మేం చదువుకునే రోజుల్లోనే అష్టమి చంద్రుడు లాంటి బట్టతల ఉండేది. అది దిన దిన ప్రవర్థమానమై ఇప్పుడు పూర్ణ చంద్రుడిలా ఉంది. "బట్టతల జీనియస్‌ల లక్షణంట. అందుకే మేష్టారు ఇంతవారైనారు" అనుకుంటూ ఆయన మెడలో దండ వేసే సాను. తప్పించుకోవాలనే ప్రయత్నంతో ఆయన చేతులు అడ్డుపెడితే నేను వాటిని పక్కలకు నెట్టేసి దండ వేయాల్సి వచ్చింది.

ఆ తర్వాత రైలు పెట్లు నలుగురూ-అంటే నా జూనియర్లు- టపటపా, చీమలతో సహా తమ దండల్ని ఆయన మెడలో వేసేసారు. నా శిష్యులు నా అంతటి వాళ్లయ్యారనే గర్వంతో వేదిక దిగసాగాను కాని సభలో ఈలలూ కేకలూ మూతి విరుపులూ పెద్ద పెట్టున చెల రేగడంతో ఏదో కీడు శంకించి విజయ గర్వాన్ని అదుపు చేసాను.

ఎన్నెమ్మార్ గారు ఏభై ఆరేళ్ళవాడు అంత బాగా నాట్యం చేయడం నేనిదే మొదటి సారి చూడ్డం! ప్రళయ తాండవం చేస్తున్న శివుడిలా నిప్పులు కురిపిస్తూ, "భద్రిరాజూ, కొంప ముంచేశావోయ్! నువ్వు పూలమాల వేసింది ప్రొఫెసర్ కేడీకి కాదు, యూనివర్సిటీ కాంట్రాక్టర్‌కి! ఇదేం సరదా, స్టుపిడ్ ఫెలో?" అని నలుగుర్లోనూ నన్ను ఇన్‌సల్ట్ చేశాడు.

"అదేమిటిసార్! ఆయనే కేడీరావు గారు. రెండేళ్ళు ఆయన పాఠాలు విన్నాను, ఆ మాత్రం తెలీదా? " అన్నాను.

"ఛ! డబాయించకు; ఆయన ప్రొఫెసరే కాదసలు. ఆఖరికి ఎమ్మెస్సీ చదవలేక మీ మోహన్‌లా మేజిక్ నేర్చుకున్న ప్రొఫెసర్ కూడా కాదు. నీ వరస చూస్తుంటే నువ్వెనాడూ క్లాసులకి వెళ్లినట్లు లేదు. కాపీలు కొట్టి ఎమ్మెస్సీ పేసయ్యావేమో!" అంటూ నా జుట్టు అందక పోడం చేత తన జుట్టు పీక్కుంటూ ఎగరసాగాడు.

నేనిప్పుడు దండ వేసిన బట్టతలాయన మేం చదువుకునే రోజుల్లో రీసెర్చి స్కాలర్‌ట. అంచేత సహజంగానే ప్రొఫెసర్ కేడీ చెప్పాల్సిన క్లాసులన్నీ ఇతనే చెప్పాడు.

ఈ వివరణ నాకూ, ఎన్నెమ్మార్‌కి ఓ ప్యూన్ ద్వారా లభించింది.

ఆ కంగారులో మోహన్ తన దండ కూడా వసంత చేతుల్లో పెట్టి మాయమైపోయాడు. వసంత ఆ రెండు దండలూ నా మెడలో వేసేసి, ఎన్నెమ్మార్‌కి దణ్ణం పెట్టి, ఏమీ ఎరగనట్లు ఓ కుర్చీలో కూర్చుంది.

ఆ విధంగా వసంత వంటి అందమైన అమ్మాయి తర్వాత పెద్దల సమక్షంలో నన్ను పెళ్లాడే వీలు కలిగింది.

(కోస్తావాణి; దినపత్రిక, 12-5-1986)

★